ప్రగతిభవన్‌లో ఘనంగా దసరా వేడుకలు

దసరా పండుగ సందర్భంగా ప్రగతిభవన్‌లో ఆయుధపూజ నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్

నల్లపోచమ్మ, అమ్మవారికి కుటుంబ సమేతంగా సీఎం ప్రత్యేక పూజలు

శమీపూజ, వాహనపూజ, ఆయుధపూజల్లో పాల్గొన్న కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): విజయదశమి వేడుకలు సోమవారం ప్రగతిభవన్‌లో ఘనంగా జరిగాయి. తొలుత ప్రగతిభవన్‌లోని నల్లపోచమ్మ అమ్మవారి దేవాలయంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కుటుంబసమేతంగా వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం సతీమణి శోభ, కుమారుడు, మంత్రి కేటీఆర్, కోడలు శైలిమ, మనుమడు హిమాన్ను పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో జమ్మిచెట్టుకు శమీపూజ నిర్వహించిన పూజారులు విజయాలు సిద్ధించాలని ఆశీర్వచనం ఇచ్చారు. శుభసూచకంగా భావించే పాలపిట్టను సీఎం దర్శనం చేసుకున్నారు. సంప్రదాయం ప్రకారం దసరా నాడు ప్రత్యేకంగా నిర్వహించే వాహనపూజలో మనుమడు హిమాన్నను తోడ్కొని సీఎం పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో వేదపండితులు నిర్వహించిన ఆయుధపూజలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ సీఎం కేసీఆర్ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం కర్ణాటకలోని శృంగేరి పీఠం నుంచి తీసుకొచ్చిన శారదాదేవి నవరాత్రోత్సవ ప్రసాదాన్ని ముఖ్యమంత్రి దంపతులకు పూజారులు అందజేశారు. సీఎం కేసీఆర్‌కు కశ్మీర్‌లోని శారద స్వరజ్ఞపీఠం దేవాలయ జ్ఞాపికను తెలంగాణ మాసపత్రిక ఎడిటర్ అష్టకాల రామ్మోహన్‌రావు అందజేశారు.

ఎమ్మెల్సీ కవితకు ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ ఆహ్వానం

హైదరాబాద్, అక్టోబరు 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పథకాల ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. ఇక్కడ అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలకు అంతర్జాతీయంగా మరోసారి గుర్తింపు లభించింది. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణను గుర్తించిన లండన్‌లోని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ.. కీలకోపన్యాసం ఇవ్వడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆహ్వానించింది. తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై 'డెవలప్‌మెంట్ ఎకనామిక్స్' అంశంపై ఈ నెల 30న జరుగనున్న సదస్సులో వివరించాలని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ కోరింది. పదేండ్ల పాలనలో సీఎం కేసీఆర్ చేపట్టిన అనేక కార్యక్రమాలు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని ఆకర్షించాయి. ఇటీవల బ్రిడ్జ్ ఇండియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడానికి లండన్ వెళ్లిన కవిత.. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ విద్యార్థులతో భేటీ అయ్యారు.

కాళేశ్వరం ఆయకట్టుకు ఢోకా లేదు

- పిల్లర్ కుంగినా.. నీళ్ల పంపింగ్ ఆగదు
- బరాజ్‌లో కాఫర్ డ్యామ్ నిర్మించే అవకాశం
- యథావిధిగా ఈ ఏడాది కూడా సాగునీరు
- ఇప్పటికే నిండుగా జలాశయాలు
- ఇంజినీరింగ్ నిపుణుల భరోసా

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్‌లోని పిల్లర్ కుంగుబాటు వల్ల కాళేశ్వరం ఆయకట్టుకు ఎలాంటి ఢోకా లేదని, యథావిధిగా సాగునీటిని అందించే అవకాశమున్నదని ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు చెప్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు పరిధిలోని అన్ని రిజర్వాయర్లలో ఆయకట్టుకు కావాల్సిన నీరు అందుబాటులో ఉన్నది. అవసరమైతే మేడిగడ్డ నుంచి కూడా పంపింగ్ చేసుకునే అవకాశమున్నదని, అందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని వివరిస్తున్నారు. మేడిగడ్డ వద్ద లక్ష్మీబరాజ్‌కు సంబంధించి 7వ బ్లాక్‌లోని 20వ పిల్లర్ కుంగుబాటుకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా బరాజ్‌లోని నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీనిపై పలువురు, పలు రకాలుగా ప్రచారం చేస్తూ.. ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొందని వదంతులను వ్యాపింప జేస్తున్నారు. దీనిపై పలువురు ఇరిగేషన్ ఉన్నతాధికారులను సంప్రదించగా మేడిగడ్డ బరాజ్ సంఘటనతో కాళేశ్వరం ఆయకట్టుకు ఎలాంటి ఢోకా లేదని వారు తేల్చిచెప్పారు.

గత ఏడాది 34టీఎంసీలు

మేడిగడ్డ బరాజ్ నుంచి గత ఏడాది యాసంగి సీజన్‌కు 34టీఎంసీల నీటిని మళ్లించారు. రాజరాజేశ్వర జలాశయం, అక్కడి నుంచి ఎగువన ఉన్న అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ తద్వారా నిజాంసాగర్, ఇక దిగువన ఎల్ఎండీతోపాటు అక్కడి నుంచి ఎస్సారెస్పీ స్టేజ్-2లో చివరి ఆయకట్టు ప్రాంతమైన సూర్యపేట వరకు సాగునీటిని సరఫరా చేశారు. ప్రస్తుతం మేడిగడ్డలో పరిణామం కారణంగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నప్పటికీ కాళేశ్వరం ఆయకట్టుకు ఎలాంటి ఇబ్బంది లేదని ఇరిగేషన్ ఉన్నతాధికారులు భరోసా ఇస్తున్నారు. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన అన్ని రిజర్వాయర్లలో సామర్థ్యం మేరకు నీరు నిల్వ ఉన్నదని, యాసంగి అవసరాలు తీరిపోతాయని అంటున్నారు. మేడిగడ్డ నుంచి కూడా నీటిని మళ్లించేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

మేడిగడ్డ నుంచీ పంపింగ్‌కు అవకాశం

పిల్లర్ కుంగిపోయినప్పటికీ లక్ష్మీబరాజ్ నుంచి నీటిని మళ్లించేందుకు అన్నివిధాలుగా అవకాశాలున్నాయని ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. మేడిగడ్డ వద్ద సీ లెవల్ 89 మీటర్లని, పంపింగ్ 92 మీటర్ల ఎత్తు నుంచి చేస్తున్నారని.. దాదాపు 3-4మీటర్ల ఎత్తులో నీటిని మెయింటైన్ చేయగలిగితే ఎత్తిపోసుకోవచ్చని, అందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించారు. ప్రస్తుతం లక్ష్మీబరాజ్ వద్ద 7వ బ్లాక్‌లోని పిల్లర్లను కవర్ చేస్తూ కాఫర్ డ్యామ్‌ను నిర్మించే అవకాశముందని, తద్వారా నీటిని నిర్దేశిత ఎత్తు మేరకు నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. కాఫర్ డ్యామ్‌ను నిర్మించి పంపింగ్ చేసుకోవడంతోపాటు, బరాజ్ పునరుద్ధరణ పనులను కూడా చేపట్టేందుకు ఎల్ అండ్‌టీతో కలిసి ఇప్పటికే ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. వీలైనంత త్వరగా పునరుద్ధరణ పనులు పూర్తిచేస్తామని, అదేసమయంలో ఈ సీజన్‌కు సంబంధించి సాగునీటిని కూడా అందిస్తామని ఇరిగేషన్ అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

ఆయా రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం, ప్రస్తుతం ఉన్న నీరు (టీఎంసీలలో)

రిజర్వాయర్	నీటినిల్వ సామర్థ్యం	ప్రస్తుత నీటిమట్టం
ఎస్సారెస్పీ	90 టీఎంసీలు	87
సరస్వతి	10.87	7.87
పార్వతి	8.83	5.94
ఎల్లంపల్లి	20	20
రాజరాజేశ్వర	25	23
ఎల్ఎండీ	20	20
అన్నపూర్ణ	3.5	2.17
రంగనాయకసాగర్	3	1.66
మల్లన్నసాగర్	50	15
కొండపోచమ్మ	15	8.5

భారీ శబ్దంపై విచారణ జరపండి

- పోలీసులకు ఇరిగేషన్ శాఖ ఏఈఈ రవికాంత్ ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో భారీ శబ్దంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 21న మేడిగడ్డ బరాజ్ మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో భారీ శబ్దం వినిపించడంతో అప్రమత్తమైన ఇరిగేషన్ శాఖ అధికారులు, ఎల్అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించి ఐదేళ్లు గడుస్తుండగా ఇప్పటి వరకు అనేక భారీ వరదలు వచ్చినప్పటికీ ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఈ క్రమంలో భారీ శబ్దంతో బ్రిడ్జి స్వల్పంగా కుంగడంపట్ల అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఇరిగేషన్ శాఖ మహాదేవపూర్ ఏఈఈ రవికాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 21న బరాజ్‌పై మహారాష్ట్ర వైపు నుంచి 300 మీటర్ల దూరంలో భారీ శబ్దం వచ్చిందని, 7వ బ్లాక్‌లో 19, 21వ పిల్లర్ల మధ్య భాగం కొంత మేరకు కుంగిందని, శబ్దం వచ్చిన తర్వాత ఎల్అండ్‌టీ కంపెనీకి చెందిన ఫోర్‌మెన్ బిద్యుత్ దేబ్‌నాథ్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించామని వెల్లడించారు. 20వ పిల్లర్ వద్ద కొంత వరకు కుంగి కనిపించిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్ 174/2023, యూ/ఎస్, ఐపీసీ 427, సెక్షన్ 3 పీడీపీపీ కింద కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కిరణ్ ప్రభాకర్ ఖరే సైతం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్టు తెలిపారు. భద్రత దృష్ట్యా మాత్రమే బ్రిడ్జిపై నుంచి రాకపోకలను నిలిపివేసినట్టు వెల్లడించారు.

'మేడిగడ్డ'ను సందర్శించిన కేంద్ర బృందం

- నేడు ఇరిగేషన్ అధికారులతో భేటీ
- 20వ పిల్లర్ వద్ద కుంగిన బ్రిడ్జి ఇప్పటికీ అదే పరిస్థితిలో..
- ఒక ఫీట్ కంటే ఎక్కువ కుంగలేదు
- వెల్లడించిన స్థానిక అధికార బృందం

హైదరాబాద్/జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్ స్వల్పంగా కుంగిన నేపథ్యంలో మంగళవారం అక్కడ కేంద్ర బృందం పరిశీలించింది. ఈ నెల 21న బరాజ్‌లోని 20వ పిల్లర్ వద్ద పేలుడు శబ్దం రాగా, బ్రిడ్జి కొద్ది మేరకు కుంగిన విషయం తెలిసిందే. భద్రత దృష్ట్యా బరాజ్ పైనుంచి రాకపోకలను పోలీసు అధికారులు నిలిపివేశారు. ఈ ఘటన జరిగిన వెంటనే అధికారులు మహారాష్ట్ర, తెలంగాణ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఆరుగురు నిపుణులతో కేంద్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్‌జైన్‌తోపాటు కే శర్మ, ఆర్ తంగమాణి, రాహుల్ కే సింగ్, దేవేందర్‌రావు, ఇద్దరు సభ్యులు కలిసి లక్ష్మీ బరాజ్‌ను పరిశీలించారు. ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు బృందంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా, బరాజ్‌పై 20వ పిల్లర్ వద్ద కుంగిన బ్రిడ్జి ఇప్పటికీ అదే పరిస్థితిలో ఉన్నదని, ఒక ఫీట్ కంటే ఎక్కువ కుంగలేదని అధికారులు తెలిపారు.

నేడు జలసౌధలో భేటీ

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలోని అధికారుల బృందం బుధవారం జలసౌధలో ఇరిగేషన్ అధికారులతో భేటీ కానున్నది. తెలంగాణ రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ కమిటీ బాధ్యులు, ఈఎన్సీ నాగేంద్రరావు నేతృత్వంలో బరాజ్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించిన బృందం రాష్ట్ర ఇరిగేషన్ అధికారులు, కాళేశ్వరం ప్రాజెక్టు అధికారులతో దీనిపై చర్చించనున్నది. సాంకేతిక వివరాలను అడిగి తెలుసుకోనున్నది. అనంతరం కేంద్రానికి తమ నివేదికను సమర్పించనున్నది.

ప్రొఫెసర్ సారంగ్‌కు అరుదైన గౌరవం

- డబ్ల్యూహెచ్‌వో టీబీ అడ్వైజరీ గ్రూప్ సభ్యుడిగా నియామకం

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) :ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) క్షయ (టీబీ)-స్ట్రాటజిక్ అండ్ టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ సభ్యుడిగా హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రొఫెసర్ సారంగ్ దియో నియమితులయ్యారు. అంతర్జాతీయంగా 15 మంది నిపుణులతో ఈ బృందం ఏర్పాటైంది. ఇందులో మన దేశానికి చెందిన సారంగ్ దియో, యెనెపోయా మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ అనురాగ్ భార్గవ సభ్యులుగా ఉన్నారు. క్షయవ్యాధిని అంతం చేయడం, వ్యాధిని నిర్మూలించేందుకు ఈ బృందంలోని సభ్యులు అత్యాధునిక, శాస్త్రీయ, సాంకేతిక పరిష్కారాలను సిఫారసు చేస్తారు.

బెంగళూరులో భారతీయ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్న విదేశీ జంటలను అభినందిస్తున్న రవిశంకర్

విజయదశమివేళ విదేశీ జంటలకు పెండ్లి

- వేదమంత్రాల సాక్షిగా ఒక్కటైన వధూవరులు
- బెంగళూరు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఘనంగా వివాహం

హైదరాబాద్, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ) : భారతీయ సంప్రదాయ వివాహ సంస్కృతిపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతున్నది. విజయదశమి పర్వదినాన విదేశీ జంటలు వేదమంత్రాల సాక్షిగా ఒక్కటయ్యారు. జపాన్, మంగోలియా, అమెరికా తదితర దేశాల నుంచి వచ్చిన పలు జంటలకు భారతీయ వైదిక సంప్రదాయం ప్రకారం వివాహం జరిగింది. ఇందుకు బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ సెంటర్‌లోని వైదిక వివాహ మంటపం వేదికైంది. ఈ వివాహ వేడుకకు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ స్వయంగా హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. భారతీయ వివాహాలలో ఆడంబరాలు పెచ్చుమీరుతున్న ఈ కాలంలో వేదమంత్రాల సాక్షిగా ప్రమాణాలు, ఒకరిపట్ల ఒకరు నిబద్ధత కలిగి ఉండటం వంటి మౌలిక అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే వైదిక వివాహాలకు తిరిగి ప్రాచుర్యం కల్పించేందుకు రవిశంకర్ కృషి చేస్తున్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో లక్షలాది భక్తులు

దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజులపాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలో ప్రాచీ నవేద మంత్రోచ్చారణలు, హోమాలు, భక్తి సంగీత-నృత్యోత్సవాల శోభతో కూడిన వాతావరణం వెల్లివెరిసింది. దేశం, విదేశాల నుంచి లక్షలాది భక్తులు ఈ దేవీ నవరాత్రి ఉత్సవాలలో పాలుపంచుకొన్నారు. దుర్గాష్టమిరోజున 17 రకాల శాకాహార వంటకాలతో కూడిన భోజనాలను 1,20,000 మంది భక్తులకు వడ్డించారు.